క్లుప్తంగా

వెనక్కి మళ్లిన సముద్రం



మంగమారిపేట వద్ద వెనక్కు మళ్లిన సముద్రం

కొమ్మాది: గత నెల రోజుల నుంచి వర్షాలు, తుపాన్ల నేపథ్యంలో సముద్రం ముందుకు వచ్చి భారీ ఎత్తున అలలు ఎగసిపడి కొన్ని చోట్ల తీరాన్ని భాగీగా కోతకు గురిచేసింది. మంగమారిపేట వద్ద శనివారం సముద్రం శాంతించి కాస్త వెనక్కి మళ్లడంతో తీరమంతా విశాలంగా మారి రాళ్లతో కనువిందు చేసింది. ఇటుగా వచ్చిన పర్యాటకులు కాసేపు సరదాగా గడిపారు.

డిగ్రీ ఫలితాలలో శ్రీబాసర విద్యార్థుల ప్రతిభ

తగరపువలస: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో శనివారం విడుదల అయిన 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో స్థానిక శ్రీబాసర డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచారు. బీఎస్సీ(ఎంపీసీఎస్) నుంచి ఎం.శ్రావణి పదికి పది పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా షేక్ రహీదా బీబీ 9.73 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఇదే కళాశాల నుంచి 20 మంది విద్యార్థులు 9 కంటే ఎక్కువ పాయింట్లు సాధించారు. వీరిని శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్, ప్రిన్సిపాల్ చొప్పా సురేష్, ఎం.భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, ఏవో ఎస్.కేశవ, అధ్యాపక సిబ్బంది అభినందించారు. చిట్టివలస శ్రీకృష్ణా డిగ్రీ కళాశాలకు చెందిన నమ్మి హరిప్రియ 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో బీఎస్సీ నుంచి 10 పాయింట్లకు గాను 9.87 పాయింట్లు అలాగే దుంప దీపిక 9.70 పాయింట్లు సాధించారు. 15 మంది విద్యార్థులు 9 పాయింట్లకు పైగా, 50 మంది విద్యార్థులు 8 పాయింట్లకు పైగా ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాసంస్థల చైర్మన్ బి.నరసింగరావు, ప్రిన్సిపాల్ జె.సతీష్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

కాగితాలపేట రోడ్డు శిథిలం



బీటలు వారిన కాగితాలపేట సీసీ రోడ్డు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీ కాగితాలపేట సీసీరోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. పదేళ్ల క్రితం తాటితూరు నుంచి మజ్జివలసకు వెళ్లే మార్గంలో ఈ సీసీ రోడ్డును నిర్మించారు. రైతులకు ఉపయోగకరమైన ఈ రహదారి బీటలు వారడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇదే మార్గంలో శింగనబంధ, లక్ష్మీపురం, టి.నగరపాలెం పంచాయతీలతో పాటు పద్మనాభం మండలానికి దగ్గరదారి కావడంతో పలువురు రాకపోకలు సాగిస్తుంటారు. సీసీరోడ్డును పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

ఫిజియోథెరపీ విద్యార్థులకు ర్యాంకులు



విద్యార్థినులను అభినందిస్తున్న డీన్ డాక్టర్ సుధాకర్

తగరపువలస: ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ విడుదల చేసిన రెండో సంవత్సరం ఫిజియోథెరపీ పరీక్షలలో సంగివలస అనిల్ నీరుకొండ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. యూనివర్సిటీ స్థాయిలో ఎం.అనురాధ మొదటి ర్యాంకు, ఝాన్సీ రాణి రెండో ర్యాంకు సాధించారు. మొత్తం 15 మంది విద్యార్థులు పరీక్షలకు వెళ్లగా నలుగురు డిస్టింక్షన్‌లోనూ తొమ్మిది మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. వీరిని ఎన్ఆర్ఐ కళాశాల డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్‌కుమార్, విభాగాధిపతి డాక్టర్ బేతియన్, ఏవో శివప్రసాద్ తదితరులు అభినందించారు.

‘భౌ’ పెడుతున్నాయ్..!



కుమ్మరివీధిలో ఇంటి ముందు తిష్ట వేసిన కుక్కల గుంపు



రోడ్లపై వీధి కుక్కలు

తగరపువలస: భీమిలి జోన్ పరిధిలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధి కుక్కల నియంత్రణలో జీవీఎంసీ అలసత్వాన్ని ప్రదర్శిస్తోంది. చిన్నా, పెద్ద తేడా లేకుండా కుక్కలు ఎగబడి కరుస్తున్నా.. యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్రవాహనదారులను వెంబడించి పరుగుపెట్టిస్తున్నాయి. వీధికుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రివేళల్లో రోడ్లపైకి గుంపుగుంపులుగా వచ్చి రోడ్లపై నుంచి వెళ్ళే వారిపై దాడులు చేస్తుండడంతో కుక్కలు కనబడితే చాలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. ప్రతిరోజు ఎక్కడో ఒక చోట వీధి కుక్కల బారిన పడి గాయపడిన సంఘటన జరుగుతూనే ఉంది. స్థానిక మార్కెట్లో వ్యాపారులు వేసే చేపలు, కోళ్లు, మేకల మాంస వ్యర్థాలను తిని గ్రామాలపై దాడులు చేస్తున్నాయి. తగరపువలస, బంగ్లామెట్ట, కార్మికవాడ, సంగివలస గ్రామాల్లో, సత్యనారాయణపేట కొండమీద నుంచి సంతపేట, ఆదర్శనగర్, నమ్మివానిపేట, భీమిలి తదితర చుట్టుపక్కల గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



వీధి కుక్కలు ఏ క్షణం ఎవరిపై దాడులు చేస్తాయో తెలియక నిత్యం భయంగా ఉంటుంది. చేతిలో కర్రలు లేకుండా బయటకు రాలేకపోతున్నాం. జీవీఎంసీ రక్షణ చర్యలు చేపట్టాలి.
–ఏలూరు రాంబాబు, తగరపువలస

కుక్కల ఏరివేత జరిగాలి



భీమిలి, సంగివలస, తగరపువలస, చిట్టివలస వీధులలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో ఈ ప్రాంతాల్లో ప్రజలు బయటకు రవాలంటే భయపడే పరిస్థితి ఉంది. జీవీఎంసీ అధికారులు వీధి కుక్కలను ఇక్కడ నుంచి తరలించాలి.
–నీలాపు గౌరీ మనోహర్‌రెడ్డి, చిట్టివలస

ఆ పీఎస్ రూటే వేరు!



చోరీ జరిగిన పనోరమ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ



చోరీ జరిగిన చోట విచారణ చేస్తున్న పోలీసులు

- అన్ని కేసుల్లో గోప్యత పాటిస్తున్న పీఎం పాలెం పోలీసులు
- పనోరమ హిల్స్‌లో 70 తులాల బంగారు ఆభరణాల చోరీ
- నగదుపై తేలని లెక్క

మధురవాడ: పీఎంపాలెం పోలీసు స్టేషన్ నిత్యం వార్తల్లోకెక్కుతోంది. ఈ పోలీసు స్టేషన్‌పై ఇప్పటికే అనేక ఆరోపణలున్నాయి. పీఎస్ పరిధిలో ఏ సంఘటన జరిగినా బయటకు పొక్కనీయకుండా గోప్యత పాటిస్తున్నారు. కనీసం మీడియాకు కూడా సమాచారం ఇవ్వకుండా దాటవేస్తున్నారు. దాడి జరిగినా...దొంగతనం జరిగినా వివరాలు వెల్లడించడం లేదు. చోరీ సొత్తు విలువ ఎంత? నిందితులు ఎవరు? అనే విషయాలను బయటకు చెప్పకపోవడంతో అనేక అనుమానాలు తావిస్తోంది. విశాఖ నార్త్ సబ్ డివిజన్ పీఎంపాలెం లా అండ్ ఆర్డర్, క్రైమ్ పోలీస్ స్టేషన్‌లలో క్రైం రేటు గత కొంత కాలంగా పెరుగుతూ వస్తోంది. తాజాగా మధురవాడ పనోరమ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ వంటి అత్యంత భద్రత ఉన్న చోట కూడా సులువుగా చోరీలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి గేటెడ్ కమ్యూనిటీలో సుమారు 60 నుంచి 70 తులాలు వరకు బంగారు ఆభరణాలు, రూ. 10 లక్షలు చోరీ గురైనట్టు సమాచారం. ఏ పోలీసు స్టేషన్ పరిధిలోనైనా చోరీ జరిగితే మీడియా వివరాలు వెల్లడిస్తారు. దొంగతనం జరిగిన తీరు వివరిస్తారు. అయితే పీఎంపాలెం పోలీసు స్టేషన్‌లో మాత్రం ఏ వివరాలు చెప్పడానికి ఇష్టపడడం లేదు.

చెడ్డీ గ్యాంగ్ పనా.. లేక పారాదీప్ గ్యాంగా...

గేటెడ్ కమ్యూనిటీలో 2018లో చెడ్డీ గ్యాంగ్‌కు చెందిన ముఠా చోరీకి పాల్పడింది. గురువారం జరిగిన చోరీ కూడా అదే గ్యాంగ్ పాల్పడి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే చోరీకి పాల్పడిన వారు చెడ్డీ గ్యాంగా.. లేక పారాదీప్ గ్యాంగా అన్న కోణంలో ప్రత్యేక బృందాలు విచారణ చేస్తున్నాయి. నగదు ఎంత అన్నది ఎఫ్ఐఆర్‌లో నమోదుచేసినా వివరాలు చెప్పడానికి ఎస్ఐ శ్రీనివాస్ అందుబాటులోకి రాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, టీసీఎల్ ఏసీపీ వెంటరావు చెప్పారు. అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని, చోరీ జరిగిన ఇంట్లో మెయిన్ డోర్ తప్పా ఇతర తలుపులు కూడా వేసి లేవని, సీసీ పుటేజ్‌లో కూడా ఎక్కడ వీరి ఆనవాళ్లు లభ్యం కాలేదన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు



పద్మనాభంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అన్నారు. విజయవాడలో స్వరాజ్ మైదానంలో సామాజిక న్యాయ మహా శిల్పంపై పచ్చ మూకలు చేసిన దాడిని పద్మనాభం మండల వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం ఖండించారు. పద్మనాభం జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ మండల లీగల్ అధ్యక్షుడు ఈర్ల ఈశ్వరరావు మాట్లాడుతూ నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అముజూరి అప్పారావు, చందక శ్రీను, తాలాడ పద్మనాభం, తోనంగి అప్పలనాయుడు, సుంకర పైడినాయుడు, బూసురోతు అప్పారావు, కర్రి శ్రీను, సుంకర నారాయణరావు, కరిమిరెడ్డి రవి, ములపర్తి పైడిరాజు. పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమ్మాది: విజయవాడ స్వరాజ్ మైదానంలోని సామాజిక న్యాయం మహాశిల్పంపై అధికార మదంతో దాడికి పాల్పడిన కూటమి నాయకులు వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్‌సీపీ నియోకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సియాద్రి కనకరాజు డిమాండ్ చేశారు.

కొమ్మాది ఎస్సీ కాలనీలో దాడిని నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దళితులకు సముచిత న్యాయం కల్పించిందని, నేటి ప్రభుత్వం దాడులు చేయిస్తుందన్నారు. కార్యక్రమంలో జామి శివ, అప్పన్న, ప్రసాద్, శ్రావణ్, సన్యాశిరావు, కనకరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలు పెంచుదాం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

తగరపువలస: ఔషధ గుణాలు కలిగిన మొక్కలతో పాటు దేశీయ ఆకుకూరలు, కూరగాయల మొక్కలు నాటుదామని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తెలిపారు. శనివారం ఆనందపురం మండలం కేజీబీవీ ఆవరణలో ఆయన విద్యార్థినులతో మొక్కలు నాటించే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు. భవిష్యత్తు తరాల కోసం సామాజిక వనాలు పెంచుదామన్నారు. అధ్యాపకురాలు సంధ్యా ప్రసాదిని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ విద్యార్థులు కృషి చేస్తున్నారన్నారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ అందించిన విత్తనాలతో కేజీబీవీని నందనవనంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీలక్ష్మి, లక్ష్మి, షీలా, టి.తారక, సరస్వతి, బి.స్వరాజ్యలక్ష్మి, అనురాధ, కుమారి, గ్రీన్ క్లైమేట్ కార్యకర్తలు జనపరెడ్డి రవితేజ, పిల్లా కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరు సరైనది కాదు

భీమునిపట్నం: భీమిలిలోని మత్స్యకారుల మనోభావాలను బాధించే విధంగా జీవీఎంసీ అధికారులు వ్యవహరిస్తున్నారని ఇది సరైనది కాదని ఇక్కడ మత్స్యకారులకు సంబంధించిన ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మత్స్యకారుల్లో ఎవరు చనిపోయినా శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు తీర ప్రాంతంలోని శ్మశాన వాటికలో ఖననం చేసే ఆచారం పూర్వకాలం నుంచి ఉందన్నారు. ఇప్పుడు కొత్తగా అధికారులు తీరంలో ఖననం చేయకూడదని అభ్యంతరం చెప్పడంతోపాటు హెచ్చరిక బోర్డును పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఇక్కడ ఉన్న ఒక ప్రయివేటు రిసార్ట్ వారికి వీరు వత్తాసు పలుకుతూ తమను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇదే సమస్య వస్తే నాటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకు వెళ్లగా తక్షణం న్యాయం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ మాకు అధికారులు అడ్డుతగులుతూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు



బేడాపై పిచ్చి మొక్కలు తొలగిస్తున్న యువకుడు

పద్మనాభం: పద్మనాభంలో వెలసిన కుంతీమాధవ స్వామి ఆలయం సన్నిధిలోని పిచ్చి మొక్కలు తొలగించడానికి శనివారం యువత శ్రీకారం చుట్టింది. బేడా ప్రాంగణంలో కింద మాధవ స్వామి ఆలయం వెనుక భాగంలోను, బేడ పైన పిచ్చి మొక్కలు దట్టంగా విస్తరించాయి. వీటిని తొలగించడానికి పద్మనాభం, ఇసకలపాలెం గ్రామానికి చెందిన యువత 15 మంది ముందుకు వచ్చారు. ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటలకు వరకు శ్రమదానం చేసి కొంత వరకు పిచ్చి మొక్కలు తొలగించారు. మరో రెండు రోజులు శ్రమదానం చేసి పూర్తిగా తొలగిస్తామన్నారు.

పద్మనాభం జంక్షన్‌లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



పద్మనాభం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో శనివారం మూడు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దీంతో వాహనాల వేగానికి కళ్లెం పడింది. ఈ జంక్షన్ మీదుగా విజయనగరం, సింహాచలం, మహారాజుపేట, తగరపువలస, భీమునిపట్నం, విశాఖపట్నం ప్రాంతాలకు బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటాయి. మూడు రోడ్ల జంక్షన్ అయిన ఈప్రాంతం వాహనాలతో నిత్య రద్దీగా ఉంటుంది.స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరిగేవి. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి విజయనగరం, మహారాజుపేట, సింహాచలం వెళ్లే రూట్లలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

వీల్ చైర్ల వితరణ

మధురవాడ: మారికవలసలోని గాయత్రి మెడికల్ కళాశాలకు రోటరీ క్లబ్ ప్రతినిధులు శనివారం ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమలో 10 వీల్ చైర్లు అందజేశారు. సంస్థ ప్రతినిధులు యాసిన్, నేతాజీ కిషోర్ తదితరుల వీటిని గాయత్రి ఆస్పత్రి ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమిలిలో వర్షం



సంతపేటలో కురుస్తున్న వర్షం

తగరపువలస: భీమిలి పరిధిలో శనివారం సాయంత్రం కుండపోత వాన కురిసింది. వివిధ విద్యాసంస్థల నుంచి విద్యార్థులు బయటకు రావడంతో వర్షానికి కొంత ఇబ్బంది పడ్డారు. పలుచోట్ల ఎప్పటిలాగే డ్రైనేజీలు నిండిపోయి అందులో చెత్త రోడ్లపైకి చేరింది. సంగివలస, ఆదర్శనగర్, సబ్బివానిపేటలోని పల్లపు గ్రామాలు జలమయమయ్యాయి. కొండపేట మార్గంలో పైపులైన్ కోసం తవ్విన రహదారి నిర్మాణం జరగకపోవడంతో వర్షంనీరు నిలిచిపోయింది.

‘కోరమాండల్’ వితరణ



ట్రాఫిక్ పోలీసులకు స్టాపర్స్ అందిస్తున్న కోరమాండల్ అధికారులు

మల్కాపురం: మల్కాపురం, గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ 50 స్టాపర్స్‌ను అందించింది. మల్కాపురం స్టేషన్ వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో కోరమాండల్ డీజీఎం (హెచ్‌ఆర్) ఆర్.శ్రీనివాసరావు వీటిని పోలీసులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంత పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని, పలు ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసేందుకు స్టాపర్లు అందించామన్నారు. తద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించివచ్చన్నారు. మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావు మాట్లాడుతూ కోరమాండల్ వారు ఇచ్చిన ఈ స్టాపర్స్‌ను ముఖ్య కూడళ్లలో, స్కూల్ జోన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) నారాయణపాత్రుడు, సీఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ కె.శ్రీకాంత్, ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సత్సంగ్ జిల్లా అధ్యక్షుడిగా సన్యాసినాయుడు

తగరపువలస: విశ్వహిందూ పరిషత్ జిల్లా సత్సంగ్ అధ్యక్షుడిగా భీమిలికి చెందిన కనకల సన్యాసినాయుడు నియమితులయ్యారు. పరిషత్ సత్సంగ్ రాష్ట్ర సమావేశాలు ప్రస్తుతం విజయనగరంలో జరుగుతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పాపాయి శర్మ, సన్యాసినాయుడుకు నియామక పత్రం అందించారు.

13న హిచ్‌కాక్ జయంతి సభ

మద్దిలపాలెం: ప్రపంచ మేటి సినీ దర్శకుడు ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి సభ ఈ నెల 13న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్టు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. లండన్‌లో జన్మించిన హిచ్‌కాక్, సాంకేతిక పరిజ్ఞానం లేకున్నా 18, 19 శతాబ్దాల్లో మంచి సినిమాలు అందించారన్నారు. అందుకే ఆయనను మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ అని పిలుస్తారని చెప్పారు.

ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నేత అప్పారావు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు అధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం సంతపేటలో హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం జరిగింది. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ సూచనల మేరకు ఈ నెల 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కురుమెళ్ల వెంకటేశ్వరరావు, రాజన్న, రిక్క మంగవేణి, చిల్ల త్రినాథ్, శీరపు వెంకటరెడ్డి, ధరణి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన వాకర్స్



మొక్కలు నాటుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని జమ్మిచెరువు పార్కులో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 52 పండ్లు, పూలమొక్కలను నాటారు. వీటని సంరక్షించి పెంచుతామని తెలిపారు. సభ్యులు ఎస్.జనార్ధనరావు, గాడు సన్యాసినాయుడు, వీ.ఎస్.శంకరకుమార్, పీ.కృష్ణవర్మ, డీ.శేషాద్రి, డీ.ఈశ్వరరావు, టీ.అప్పారావు, అప్పలనాయుడు, తాతారావు పాల్గొన్నారు.

బహిరంగంగానే కోడ్ ఉల్లంఘన



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రాల బ్యానర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న సంఘ నాయకులు

బీచ్‌రోడ్డు: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. అధికారులు, పోలీసుల నిర్లక్ష్యం వల్ల బహిరంగంగా కోడ్ ఉల్లంఘనలకు పలువురు పాల్పడుతున్నారు. విశాఖపట్నం చౌక దుకాణదారుల సంక్షేమ సంఘం నాయకులు శనివారం బీచ్ రోడ్డులో బహిరంగంగానే ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి మనోహర్ ఫొటోల బ్యానర్‌కు క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల కోడ్ సమయంలో ఇలా బహిరంగంగా రాజకీయ నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయడం కోడ్‌ను ఉల్లంఘించడమేనని పలువురు చెబుతున్నారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారే తప్ప.. అడ్డు చెప్పే ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం.

ఉత్సాహంగా జిల్లా స్థాయి చెస్ పోటీలు



బహుమతులతో విజేతలు

గాజువాక : గాజువాక లయన్స్ క్లబ్, ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్–13 కేటగిరీలోని ఓపెన్, బాలికల విభాగంలో నిర్వహించిన ఈ పోటీలను లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు పాలపర్తి సత్యానందం ప్రారంభించారు. సుమారు 200 మంది బాలబాలికలు పాల్గొన్న ఈ పోటీల్లో బాలుర విభాగంలో తనిష్ మొదటి స్థానాన్ని, వంశీ రెండో స్థానాన్ని సాధించారు. బాలికల విభాగంలో గొర్లె నైన మొదటి స్థానం, లహరి ద్వితీయ స్థానం సొంతం చేసుకున్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రొంగల బాబూరావు, మణికంత, కోశాధికారి ఉమా మహేశ్వరరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్యాల కోటేశ్వరరావు, పోలిశెట్టి లక్ష్మణ్, బలివాడ సత్యారావు, నున్న శ్రీనివాసరావు, బోయిన బాబూరావు, భోగవిల్లి రఘురామ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలి

ఉక్కునగరం: పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చూడాలన్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలు ఓపికతో విని పరిష్కార మార్గం చూపించాలని సూచించారు. స్టీల్‌ప్లాంట్ సెక్టార్లలో దొంగతనాలు జరగకుండా, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాల నియంత్రణకు దోహదం చేస్తుందన్నారు. రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణా మార్గాలను కట్టడి చేయాలని ఆదేశించారు.